అమెరికా తెలుగు సంఘం , అమృత్‌కిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# ప్లీజ్! ఈ పెళ్ళి ఆపండి!

-గర్శకుర్తి రాజేంద్ర

ఇంటిముందు అందంగా వేసిన పచ్చని పందిరి. పందిరి మధ్యలో వివాహమండపం... ఆదరాబాదరాగా వచ్చిపోయేజనం... అంతటా ఒకే హడావిడి.

అది ఆడపెళ్ళి వాళ్ళని చెప్పకుండానే తెలిసిపోతోంది. పెళ్ళి పెద్దలు హడావిడిగా పనులు పురమాయిస్తూంటే, పనివాళ్ళు చకాచకా చేసుకుపోతున్నారు.

"బాబూ! ఇది ఆడపెళ్ళివారిల్లేనా?" అడిగాడు అక్కడున్న పనిమనిషిని, అప్పుడే పందిట్లోకి ప్రవేశించిన ఓ పెద్దమనిషి.

పనివాడు ఒకసారి తలెత్తి ఆగంతకుడి ముఖంలోకి సూటిగా చూశాడు.

అరవైఏళ్ళ పైబడి ఉంటాయి. పీక్కుపోయిన ముఖం, సంస్కారానికి నోచుకోనిజుట్టు!

అతని వాలకం చూసి బిచ్చగాడనుకొని. "ఇంకా పెళ్ళేకాలేదు. వియ్యంకుల భోజనాలు కాలేదు" అంటూ కసిరాడు పనివాడు.



"బాబూ! నేను బిచ్చగాడిని కాదు. మీ యజమానితో కొంచెంపనుండి వచ్చాను. దయచేసి ఒకసారిపిలువు!" వేడుకున్నాడా పెద్దమనిషి.

పనివాడు విసుక్కుంటూ, "శంకరయ్యగారూ! మీకోసమెవ్వరో వచ్చారు చూడండీ" అంటూ అక్కడినుండే గట్టిగా పిలిచాడు.

"ఆ! ఆ! ఎవరదీ", అంటూ ఆత్రంగా ప్రవేశించాడు శంకరయ్య, పెళ్ళి కూతురు తండ్రి.

"అయ్యా! పెళ్ళికూతురు తండ్రి మీరేకదూ! మీతో అర్జంటుగా మాట్లాడాలి."

"అవతల నాకు అంతకంటే అర్జంటుపనులున్నాయి. నువ్వు చెప్పదలచుకున్నదేమిటో త్వరగా చెప్పు."

"దయచేసి ఈ పెళ్ళి ఆపండి!"

విస్తుపోయాడు శంకరయ్య. అంతలోనే తేరుకొని, "శుభమాని అమ్మాయి పెళ్ళిచేస్తుంటే పచ్చనిపందిట్లో ఇవేం అశుభపు మాటలు?" కోపంగా అన్నాడు శంకరయ్య.

"దయచేసి నామాట వినండి. కోరి కోరి అమ్మాయిని మృత్యుముఖంలోకి తోయకండి. మీ అమ్మాయి పెళ్ళిమానుకోండి."

ఆ మాటలు వింటూనే ఉగ్రుడయ్యాడు శంకరయ్య.

"పనికట్టుకొని మా అమ్మాయి పెళ్ళి చెడగొట్టడానికి వచ్చావు. దీనివల్ల నీకేమిటి లాభం? వెళ్ళవయ్యా, ఇక్కడినుండి వెళ్ళు ముందు" గట్టిగా అరిచాడు.

"నన్ను అపార్థం చేసుకోకండి. బాబూ నేను మీ శ్రేయోభిలాషిని. ఈ పెళ్ళివారు ఉత్త ధనపిశాచులు, పెళ్ళికి ముందు అందరూ మంచిగానే నటిస్తారు. మూడుముళ్ళు పడగానే వేధింపులు ప్రారంభించి అమ్మాయిని కాటికంపేదాకా నిద్రపోరు! చేజేతులా ఆడబిడ్డ జీవితం నాశనం చేసుకోకండి! వద్దుబాబూ! వద్దు. ఈ పెళ్ళి ఆపండి" వేడుకోలుగా అన్నాడు ఆగంతకుడు.

మా వియ్యంకుడు చాలా మంచివాడు. ముక్కూ ముఖం తెలియని నువ్వు చెపితే తప్ప మా అమ్మాయి బాగోగులు మాకు తెలీవా?" వ్యంగ్యంగా అన్నాడు శంకరయ్య.

"నేనూ ఇలాగే అనుకొని మోసపోయాను. ఇద్దరు పిల్లల్ని కని పురిటిలోనే నా భార్య చనిపోయింది. తల్లితండ్రీ నేనే అయి బిడ్డనూ, కొడుకునూ సమానంగా కష్టపడి చదివించి యోగ్యులను చేశాను.

నా కొడుకు భవిష్యత్తు పట్టించుకోకుండా నా సర్వస్వం ధారపోసి అమ్మాయిపెళ్ళి ఘనంగా చేశాను. అడిగినప్పుడల్లా అప్పుల్లో కూరుకుపోతూ వియ్యంకుల గొంతెమ్మ కోరికల్ని తీర్చాను.

అయినా తృప్తిపడక వాళ్ళు నాబిడ్డను నాకళ్ళముందే ఖిలువునా కాల్చిచంపారు. ఏడుస్తూ చెప్పాడు ఆగంతకుడు.

శంకరయ్య అతని మాటలు వింటూ స్థాణువై పోయాడు. ఆ ఆగంతకుడి అనుభవం శంకరయ్యలో అనుమానం, భయం కలిగించాయి. ఏమో తన కూతురుకు కూడా ఇలా జరిగితే మరేమైనా ఉందా ఆలోచిస్తున్నాడు.

"నాన్నా... నేను ఇక అక్కడికి వెళ్ళను. మా వాళ్ళంతా కలిసి నన్ను కాల్చిచంపడానికి పథకాలు వేస్తున్నారు. మీరు బలవంతంగా పంపిస్తే మళ్ళీ మీకు కన్పించేది నేను కాదు. నా శవమే"

"ఏమిట్రా పెళ్ళి పనులు మానేసి ఇలా పగటి కలలు కంటున్నావ్?" అంటూ కసురుతూ ప్రవేశించాడు పెళ్ళికొడుకు తండ్రి..

అతడి పిలుపుతో ఊహలతెరల్లోంచి బయటపడి, "నిజం చెప్పమౌళీ, నువ్వు నా కూతురు పద్మను నీ సొంతబిడ్డలా చూస్తావా? లేక అందర్లాగే వరకట్నం చావుకు గురిచేస్తావా?" మౌళి చేతులు కుదుపుతూ అడిగాడు శంకరయ్య.

ఈసారి విస్తుపోవడం మౌళివంతయింది. "నీకేమైనా గాలిసోకిందా, లేక మతిభ్రమించిందా? బాల్యం స్నేహితులం మనిద్దరం కలసిమెలసి తిరిగాం. నాగురించి పూర్తిగా తెలుసు. అయినా, ఇంకో కొద్దిగంటల్లో పెళ్ళి కాబోతున్న ఈ తరుణంలో నీకెందుకొచ్చిందీ చచ్చు సందేహం" అన్నాడు మౌళి కోపంగా.

"మరి... మరి"... నీళ్ళు నమిలాడు శంకరయ్య.

"ఆ విషయం నన్నడగండి నేను చెపుతాను. నేనే ఈ పెళ్ళి ఆపమని సలహా ఇచ్చాను. మీరు పెట్టేకష్టాలు ఏకరువు పెట్టాను" అన్నాడు తృప్తిగా అగంతకుడు మౌళితో.

మౌళి కోపం కట్టలు తెగింది. "ఏమిటయ్యా! నీకు మా గురించి ఏం తెలుసని, మాలో మాకు తగవులు పెడుతున్నావు? దాని వల్ల నీకు ఒరిగేదేమిటి. ఇలా పనిగట్టుకొని పెళ్ళి చెడగొట్టడమేమిటి?" కోపంగా అన్నాడు.

"మీ గురించి ప్రత్యేకంగా తెలుసుకునేదేముంది? సగటు పెళ్ళికొడుకుల్లాంటి వాడే మీ కొడుకూ, మీరో మామూలు పెళ్ళికొడుకు తండ్రి. ఇప్పుడు బాగానే ఉంటారు. పెళ్ళయ్యాక బయటపడ్తుంది మీ అసలు స్వరూపం. అందుకే ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయవద్దని, మరో వరకట్నచావు వార్త నమోదు కాకూడదని నా ప్రయత్నం" అన్నాడు ఆగంతకుడు తృప్తిగా.

"బావా! శంకరయ్యా, నా మాటవిను. వీడు నిజంగా ఏ పిచ్చివాడో లేక మన కుటుంబాలపై పగబట్టినవాడో అయి ఉంటాడు. ఈ దగుల్బాజీ మాటలు నమ్మకు. నూరు అబద్ధాలాడి ఒకపెళ్ళిచేయమన్నారు. కాని వీడేమో పెళ్ళి చెడగొడుతున్నాడు. నేనయోమయములో పడిపోతున్నావు. ఒకసారి నిజం ఆలోచించు నీకే తెలుస్తుంది" అను నయంగా అన్నాడు మౌళి.


మౌళి ఉపదేశం బాగా పనిచేసింది. శంకరయ్య సందేహాలన్నీ పటాపంచలై, ఆ ఆగంతకుడిపై ఆపుకోలేనంత కోపం వచ్చింది.

"నన్ను క్షమించుబావా! ఈ పిచ్చివాడు నా మనసు కలుషితం చేశాడు" అన్నాడు విచారంగా.

"అందుకే వీణ్ణి ముందు బయటకు గెంటాలి. శనివిరగడవుతుంది" అంటూ, ఆ ఆగంతకుడిని బయటకు తోశాడు మౌళి.

అక్కడున్న పనివాళ్ళు చుట్టుముట్టి బాగా కొట్టారు. అయినా ఆ అగంతకుడు అక్కడనుండి కదలక...

"ప్లీజ్! ఈ పెళ్ళి ఆపండి. వీళ్ళ మాయమాటలు




కెంచు చిన్నన్న , చిన్న మెట్ పల్లి (పోస్ట్), కోరుట్ల (మం.),కరీంనగర్(జిల్లా)- 505 453

నమ్మకండి." అంటూ గట్టిగా అరుస్తూ అక్కడే పడిపోయాడు.

పెళ్ళికి వచ్చినవారంతా చుట్టిముట్టి ఆ విచిత్రం చూడసాగారు.

పనివాళ్ళదెబ్బలకు వెల్లువలా చిల్లిన రక్తాన్ని చూసి అక్కడివాళ్ళకు జాలికలిగింది. కొంచెంసేపు ఆ పెళ్ళి పందిట్లో నిశ్శబ్దం రాజ్యం చేసింది...

కొద్దిక్షణాల తర్వాత వియ్యంకులిద్దరూ, ఆ ఆగంతుకుణ్ణి తట్టి చూశారు. అతడు కదలకుండా పడి ఉండడముతో ఒకవేళ చచ్చిపోలేదు. కదా అని భయంవేసింది పచ్చని పెళ్ళిపందిట్లో అలాంటిది జరిగితే మరేమైనా ఉందా!

ఆలోచన నుండి తేరుకొని అర్జంటుగా రమ్మని ఫామిలీ డాక్టరుకు ఫోనుచేశారు. పది నిమిషాలు పది యుగాల్లా గడిచాయి. వాకిట్లో కారు హారన్ వినబడగానే వియ్యంకులిద్దరికీ మనసు కుదుటపడింది.

"వాటీజ్ ద ప్రాబ్లమ్!" అంటూ అడిగి వివరాలు తీసుకుని ఆగంతకుణ్ణి సమీపించి పరీక్షచేస్తూ పరిశీలనగా చూసి - "అరే ఇతను మన రామ్మూర్తి మాష్టారు. ఇతనిక్కడికెలా వచ్చాడు? ఈ గాయాలన్నీ ఏమిటి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు డాక్టర్.

"ఇతను మీకు ముందే తెలుసా?" వియ్యంకులిద్దరూ ఒకేసారి ప్రశ్నించారు.

"బాగా తెలుసు! ఉత్తమ ఉపాధ్యాయులు. రాష్ట్రపతి అవార్డుగ్రహీత. ఈ రోజు నేనిలా డాక్టర్ని అయ్యానంటే వారు దిద్దించిన అక్షరాల పుణ్యమే" ట్రీట్మెంటు చేస్తూనే చెప్పుకుపోయాడు డాక్టరు.

"అలాగా! అయితేమరి ఈ బికారివేషం, పెళ్ళి పందిట్లో దూరి ఆడపిల్ల పెళ్ళాపమంటూ గోల చేయడం సంగతి?"

"అనుకున్నాను. అలాంటిదేదో జరిగిఉంటుందని. ఇతనిదో దయనీయ, విషాద గాథ! ఒక ఆడ, ఒక మగ ఇద్దరు కవలపిల్లల్ని కని పురిటిలోనే భార్య చనిపోతే తానే తల్లీ, తండ్రీ అయి వాళ్ళను పెంచి పెద్దచేశారు! యవ్వనంలో ఉన్నా మళ్ళీ పెళ్ళిచేసుకోక తన జీవితం వాళ్ళకే అంకితం చేశాడు. మంచి సంబంధం చూసి అమ్మాయి పెళ్ళి చేశారు. తర్వాత తెలిసింది. వాళ్ళు మేకవన్నె పులులని. అయినా వాళ్ళగొంతెమ్మ కోరికల్నీ తీరుస్తూ బిడ్డ సుఖపడ్తుందని ఆశించారు. కాని ఇంకా ఇంకా డబ్బుకావాలని పీడించి చివరికోరోజు మాష్టారి కళ్ళముందే వాళ్ళ అమ్మాయిని కాల్చి చంపారు. ఆ సంఘటనలో మాష్టారు పిచ్చివాడైపోయాడు."

వింటోన్న వాళ్ళందరి గుండెలు బరువెక్కాయి.

"ఇక అప్పటినుండి ఊరూరు తిరుగుతూ ఎక్కడైనా పచ్చనిపందిరి కన్పిస్తేచాలు, తన కూతురు పెళ్ళి జరుగుతున్నట్లు భావించి ఆ పెళ్ళి ఆపే ప్రయత్నం చేస్తుంటారు. తన కూతురా మరెవరికీ అలాంటి దుర్గతి పట్టకూడదనీ, ఆడపిల్లల పెళ్ళిచేయవద్దనీ అడ్డు పడ్తూ ఉంటారు! నేను, నాలాంటి మరెందరో డాక్టర్లు వారిని మళ్ళీ మామూలు మనిషిని చేయాలని ప్రయత్నించాం. కాని మా ఆశ నిరాశేఅయ్యింది. ఇది ప్రమాదకరమైన పిచ్చికాదని మెంటల్ హాస్పిటల్ వాళ్ళు అడ్మిట్ చేసుకోలేదు" ఉద్విగ్నంగా చెప్పుకుపోయాడు డాక్టరు.

డాక్టరుగొంతుకూడా జీరబోయింది.

మెల్లమెల్లగా రామ్మూర్తిగారిలో చలనం వచ్చింది. వియ్యంకులిద్దరూ నిట్టూర్చారు. అక్కడున్న వాళ్ళ హృదయాలు తేలికపడ్డాయి.

"నమస్కారం! డాక్టరుగారూ!" అంటూ ఆదరాబాదరాగా అక్కడికి వచ్చాడు మాష్టారి కొడుకు.

"రావోయ్ మంచి సమయానికే వచ్చావు. చూశావా? ఈ పెళ్ళిపందిట్లో మీనాన్నగారెలా అలజడి సృష్టించారో, మీ నాన్నగారి గురించి తెలియక బాగా కొట్టారు. ఇప్పటి దాకా స్పృహలేకుండా పడివున్నారు. మందులవి ఇచ్చాను. ఇప్పుడు ఫరవాలేదు! ప్రమాదం తప్పింది. త్వరగా ఇంటికి తీసుకెళ్ళు. పాపం వీళ్ళ పెళ్ళిముహూర్తం దగ్గర పడుతోంది" చెప్పారు డాక్టరుగారు.

"నేనెంత వాదిస్తున్నా, కాపలా కాస్తున్నా ఏదో ఒక సమయంలో ఇంట్లోంచి బయటపడటం, ఎక్కడో ఒకచోట ఇలా ప్రవర్తించడం, వాళ్ళచేత దెబ్బలు తినడం; మీలాంటివాళ్ళు సమయానికి సహాయం చేయడం..." బాధగా అన్నాడు మాష్టారు కొడుకు.

అక్కడున్న వాళ్ళందర్నీ క్షమాపణ వేడుకొని, రిక్షావాడి సాయంతో, తన తండ్రిని రిక్షాలో కూర్చోబెట్టుకొని అక్కడనుండి వెళ్ళిపోయాడా యువకుడు.


గర్శకుర్తి రాజేంద్ర
పోస్టల్ అసిస్టెంట్
ప్రధాన తపాల కార్యాలయము,
కామారెడ్డి. - 503 111


## జోకు



మాష్టారు: నేనడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పకపోవడానికి కారణం?...నేను చెప్పిన పాఠాలను మీరు కుడి చెవి నుండి విని ఎడమ చెవి నుండి వొదిలేస్తున్నారన్నమాట!

వెంటనే ఓ విద్యార్థి లేచి:

'లేద్సార్!... ఎడమ చెవి నుండి విని కుడి చెవి నుండి వొదిలేస్తున్నాం'

-కెంచు చిన్న,
మెట్పల్లి, వయా: మేడిపల్లి, జిల్లా: కరీంనగర్-505 453.

## బయోడేటా



గర్శకుర్తి రాజేంద్ర

1. పేరు : గర్శకుర్తి రాజేంద్ర
2. స్వగ్రామం : వేములవాడ
3. చదువు : డిగ్రీ (బి.ఎ)
4. వృత్తి : తపాలశాఖలో - సెలక్షన్ గ్రేడు సబ్ పోస్టు మాస్టర్,కామారెడ్డి గంజ్.
5. ప్రవృత్తి : సాహితీ వ్యాసంగం
6. కలం పేరు : సంధ్య
7. ఇతర వివరాలు : పత్రికల్లో కవితలు-కథలు-వ్యాసాలు ప్రచురితాలు.ఆకాశవాణిలో కవితలు-కథలు-నాటికలు, మొ॥ ప్రసారాలు. మూడు పుస్తకాలు ముద్రించిన అనుభవం. కథలకు,కవితలకు బహుమతులందుకున్న తీపిగురుతులు. ముఖ్యంగా సెప్టెంబర్ '6'న డా॥సి.నారాయణరెడ్డి గారి చేతులమీదుగా సిరిసిల్ల యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం అందుకోవడం. మరిచిపోలేని మధుర స్మృతి!

జిల్లా స్థాయిలో బీబీపేట వారు నిర్వహించిన కవితల పోటీలో ప్రథమ బహుమతి పొందటం, అఖిల భారత తపాల ఉద్యోగుల సాంస్కృతిక కార్యక్రమాలలో (ఢిల్లీలో జరిగిన) నా నాటిక ప్రదర్శింపబడటం మధురానుభవం!